

# మన్నధరించిన పుష్పం

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ఆ ఊరి ధనవంతుల్లో ఒకడైన కుక్కుటేశ్వరరావు తన గృహ ప్రవేశ సందర్భాన ఊరంతటినీ విందుకు ఆహ్వానిస్తూ జగన్మోహనరావుకు కూడా ఓ లేఖ పంపాడు. కాని జగన్మోహనరావు వెళ్ళలేదు.

అల్లాంటి మూకఉమ్మడి భోజనా లంటే అతనికి అసహ్యమే. కాక కుక్కుటేశ్వరరావు మీద పెద్ద సదభిప్రాయం లేదు కూడా. విందు చాలా ఘనంగా జరిగిందని చెప్పుకున్నారు జనం.

అది జరిగిన వారం రోజులకు కుక్కుటేశ్వరరావు స్వయంగా జగన్మోహనరావు వద్దకు వచ్చి మళ్ళీ అతణ్ని ప్రత్యేకంగా తమ ఇంటికి ఆహ్వానించాడు.

"మొన్నటి విందుకు మీరెందుకు రాలేదన్నది నేనడగను," అతనన్నాడు. "అలా అడిగేహక్కు నాకు లేదు కూడా. కాని ఈ రాత్రికి మట్టుకు మీరు తప్పకుండా రావాలి. మీకోసం ప్రత్యేకంగా డిన్నర్ అరేంజి చేస్తున్నాము. వేరే ఎవ్వళ్ళనీ పిలవటంలేదు కూడా. మీరూ, మా ఫామిలీ, నేను అంతే."

ఎన్నడూ లేనిది తనమీద చూపుతున్న ఈ ప్రత్యేక ఆదరానికి కారణం అర్ధంకాక జగన్మోహనరావు కాసేపు తబ్బిబ్బు పడ్డాడు. వాళ్ళిద్దరూ ఒక ఊరివాళ్ళే అయినా పెద్ద స్నేహం లేదు వాళ్ళ మధ్య. కుక్కుటేశ్వరరావు అంటేనూ, అతని కారెక్టరంటేనూ జగన్మోహనరావుకు చులకన.

"చూద్దాంలెండి." అన్నాడు ఏమనాలో తోచక.

"చూద్దామంటే కాదు. తప్పకుండా రావాలి మా వైశాలి మరీ మరీ చెప్పింది."

ఉలికిపడ్డాడు జగన్మోహనరావు ఆ పేరు వినగానే. కొన్నాళ్ళనుంచి ఊళ్లో ఒక అద్భుతంగా చెప్పుకోబడుతోంది ఆ పేరుగల స్త్రీ. ఆమె కుక్కుటేశ్వరరావు భార్య!

కుక్కుటేశ్వరరావు వెళ్ళిపోయాక జగన్మోహనరావు ఆలోచనలు ఎంత వద్దనుకున్నా అతని వేపే మళ్ళాయి....

వర్ధనమ్మకు ఒక్కడే కొడుకు కుక్కుటేశ్వరరావు. బురదలో పొర్లే పందిలాంటిది అతని జీవితం. ఒక నీతినియమ మంటూ లేకండా అతను తిరిగిన తిరుగుళ్ళకు రెండు సార్లు యముణ్ణి సందర్శించుకుని ఎట్లాగో బ్రతికి బయటపడ్డాడు. మరో అసహ్యకరమైన విషయమేమిటంటే అతనికి నలభై యేళ్ళు పైబడిన ఓ అమ్మమ్మతో సంబంధముండటం. పోనీ అతను 'కాసనోవా' అంటే అదీ కాదు. అంతటి ఆస్తికి వారసుడై ఉండీ పావలాకీ అర్ధకీ కక్కుర్తి పడే ఆడవాళ్ళ జోలికి కూడా పోయిన దౌర్భాగ్య శిఖామణి! అందుకనే రక్తంలో జీర్ణమయి పోయేంతగా సుఖరోగాల

వాతపడ్డాడు. ఊళ్లో తెలిసి ఎవడూ ఆఖరికి పూటకి టికానాలేనివాడు కూడా అతనికి పిల్లనివ్వటానికి సిద్ధపడలేదు.....

కుక్కుటేశ్వరరావు కుటుంబ ప్రతిష్ట కూడా కుళ్ళువాసన కొట్టే టట్లాంటిదే. ఆ ఇంట్లో వ్యక్తుల్ని గురించి ఊళ్ళోవాళ్ళు వర్ధనమ్మ కొడుకు, వర్ధనమ్మ మొగుడు, వర్ధనమ్మ జీతగాడు అంటూ వ్యవహరిస్తారంటే ఆ ఇంట్లో కుక్కుటేశ్వరరావు తల్లి డామినేషన్ ఎట్లాంటిదో గ్రహించవచ్చు. వర్ధనమ్మకు తన జీతగాడితోను, ఊళ్ళోని మరో తోటిధనికుడితోను రహస్య సంబంధాలున్నాయంటారు....

వర్ధనమ్మ మొగుడు ముసలివాడే కాక ఉత్త చవట. పగలు పొలాల వెంట పిచ్చివాడిలా తిరుగుతాడు రాత్రిళ్ళు వేదాంతం కబుర్లు చెబుతూ దేశాన్ని ఉద్ధరిస్తున్నట్లు మాట్లాడతాడు. ఇక కొడుకు సంగతి సరేసరి. తల్లినుంచి డబ్బులు చేతికందగానే లాడ్జింగుల వెంట తిరుగుతూ, తాగుతూ, పట్టణం చివరి గుడిసెల్లో మునిగి తేలుతూ జేబులు ఖాళీ అవగానే మళ్ళీ తల్లివద్దకు వస్తాడు. ఏనాడూ ఆమె అతనికి ఉత్తచెయ్యి చూపించలేదు. అట్లా ఎందుకు తిరుగుతున్నావని అడగనూలేదు, అతను చెడిపోవటానికి అన్ని అవకాశాలూ ఇస్తూ, పూర్తి స్వేచ్ఛనిచ్చింది. బహుశా భర్తలా అతను కూడా చవటకాకుండా ఉండాలనో, లేక తన సుఖాలకి అడ్డు రాకుండా ఉండాలనో కావచ్చు.

ఇట్లా సాగుతున్న సమయంలో హఠాత్తుగా వర్ధనమ్మలో మార్పు వచ్చింది. కొడుకు ఈడు మించిపోతున్నాడనో లేక తనకూ ఏళ్ళు పైబడటంతో కోరికలు కాస్త జితించటం వల్లోగాని ఆమె కుక్కుటేశ్వరరావు పెళ్ళిచేయ నిశ్చయించింది. రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదువా? వర్ధనమ్మ వద్ద ఉన్న డబ్బు ఆమె కొడుకు పెళ్ళి నిరాఘాటంగా జరిగి పోవటానికి తోడ్పడింది. వైశాలి ఆ ఇంటికి కోడలు అయింది.

వైశాలి కాపురాని కొచ్చాక ఊళ్ళో జనం ఆమె గురించి ఎంతో విడ్డూరంగా చెప్పుకున్నారు. అది ఒక్క ఆమె అందంగురించే కాదు, సంసారం దిద్దుకు రావటంలోని ఆమె నేర్పు విషయమై కూడా. ఆమె కాపురాని కొచ్చాక ఆ ఇంట్లో వర్ధనమ్మ డామినేషన్ చాలా వరకు తగ్గిపోయింది. కుక్కుటేశ్వరరావు తన తిరుగుళ్ళు కట్టి పెట్టేశాడు. వీటన్నిటి కంటే ముఖ్యమైనది.

చిత్రమైనది అతడు ఊరి బయటి తన తోటలో చక్కటి బంగళాను కట్టించటము, కొన్ని చెట్లను-ఫల సాయన్నిచ్చే వాటిని-కొట్టించేసి ఆ స్థలంలో పూలమొక్కల్ని నాటించటమూ. వీటన్నిటి వెనక ఎవరూ చెప్పక పోయినా వైశాలి హస్త మున్న దన్నది సర్వ విదితమైన విషయం....

ఆ సాయంత్రం జగన్మోహన రావు కాస్త పెందరాళే వెళ్ళాడు వాళ్ళ ఇంటికి. చుట్టూ ప్రహరీ ఉంది. గేటు తెరవగానే గార్డెన్‌లో పూల మొక్కల మధ్య వైశాలి కన్పించింది. అడుగుల చప్పుడుకి తల పైకెత్తిన ఆమె ఒక్కక్షణం తత్తర పడింది.

"మీరు....మీరు...."

"నా పేరు జగన్మోహనరావు."

"ఓ, రండి లోపలకు."

చాలాలేతగా ఉందామె మొహం. విశాలంగా ఉన్నాయి కళ్ళు. చెంపలు మెరుస్తూ పసిడి రంగులో ఉన్నాయి. పసిపిల్లవాడి పెదాల స్పర్శకు కూడా కందిపోతాయేమో నన్నట్లు. చీరను వొంటికి బిగు తుగా ధరించిందేమో ఆమె వెనుక నడుస్తున్న జగన్మోహనరావుకు ఆమె నడకలో వయ్యారం. పిరు దుల కదలికలో కవ్వింపూ కనిపిం చాయి.

కుక్కుటేశ్వరరావు ఆ సమ యాన ఇంట్లో లేడు. అతను వచ్చే వరకు ఆమె జగన్మోహనరావుకు ఇల్లంతా చూపించింది. పెద్ద భవనం అది. పురాతన కట్టడాల్లా గోడలు ఎత్తుగా ఉన్నాయి.లోపలి ఫర్నిచరు, డెకరేషను మాత్రం ఆధునికంగా ఉన్నాయి, బెడ్‌రూము తప్ప అన్ని గదులూ చూపించిందామె. డైనింగ్ హాలు, డ్రాయింగు రూము. గెస్టు లకు రెండు గదులు కాక ఎడమ భాగంలో రీడింగ్ రూము కూడా ఉంది. దాని గోడకి కిటికీ భాగంలో కర్టెన్లు దిగవేసి ఉన్న విశాలమైన ఇనప జాలీ ఉంది.కర్టెన్లు ప్రక్కకు లాగిందామె.

"గార్డెన్ ఈ వేపుకు కూడా వ్యాపించి ఉందా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అవును," ఆమె కళ్ళలో గర్వం తొణికిసలాడింది.

అప్పటికి కొద్దిగా మసకచీకట్లు కమ్ముకున్నాయి. గోడపక్కకు వెళ్ళి స్విచ్ నొక్కింది. గదినిండా ప్రవహించిన వెల్తురు జాలీగుండా పరుగు తీసుకు వెళ్ళి తోటలోకి దూకింది.

అవతల గోడపక్క రాక్‌నిండా పుస్తకాలున్నాయి. ఉత్త ఫిక్షన్

మాత్రమే కాక సైన్సు, సైకాలజీకి సంబంధించినవి కూడా ఉన్నాయి.

ఆమె అభిరుచికి అతను మెచ్చుకున్నాడు. అతనికి తెలుసు కుక్క-ఈశ్వరరావు అట్లాంటివి చదవడని.

"ఎట్లాఉంది మా ఇల్లు?" ఆఖరున అడిగిందామె.

"బాగుంది. చాలా బాగుంది... మీలాగే!" చివరిమాట అనకుండా ఉండలేక పోయాడు.

రెప్పలు టపటపలాడించిందామె. అదే సమాయాన కుక్క-ఈశ్వరరావు లోపలికి వచ్చాడు.

"ఓ. అప్పుడే చూయించేసావన్నమాట." భార్యతో అని జగన్మోహనరావు వేపు తిరిగాడు, "మా వైశాలికి తన ఇంటినీ,తోటని చూసుకుని మురిసి పోవటానికే ఎక్కడి టైమూ చాలటం లేదు."

"చాల్లే ఊరుకోండి," అందామె సిగ్గుతో.

ఆ రాత్రి భోజనాలయేసరికి తొమ్మిది దాటింది. ముగ్గురూ కలిసే చేసారు, టేబుల్ మీల్సు.

"వంట చేయటంలోను, అతిథుల్ని సత్కరించటంలోనూ మా వైశాల్ని ఎవరూ బీట్ చేయలేరండీ" మధ్యలో అన్నాడు కుక్క-ఈశ్వరరావు.

నిజమే ననిపించింది జగన్మోహనరావుకు.

సడన్‌గా కుక్క-ఈశ్వరరావు ఇలా అన్నాడు.

"అవునూ. మీరు మమ్మల్నిద్దరినీ రంగుల్లో కాన్వాసు మీద ఎందుకు చిత్రించకూడదు?"

తనెందుకు ఆహ్వానించబడ్డాడో అప్పుడు అర్థమయింది జగన్మోహనరావుకు. అతనిలోని ఆర్టిస్టుకి కుక్క-ఈశ్వరరావుని చిత్రించాలని పించలేదు. కాని వాళ్ళు ఎరగా చూపించిన పెద్దమొత్తానికి లొంగిపోయాడు. కొన్ని ఆర్థిక ఇబ్బందులు కారణంగా. అతనికి అవసరమైన సదుపాయాల నన్నింటినీ వాళ్ళింట్లోనే ఏర్పాటు చేసారు. అతనికో గదిని ప్రత్యేకంగా కేటాయించి, రంగులకీ, కేన్వాసుకీ అవసరమైన పెట్టుబడిని ముందే అడ్వాన్సుగా ఇచ్చి ఇలా....

లైఫ్ సైజులో వాళ్ళబొమ్మని చిత్రించటానికి రెండు నెలలు పట్టిందతనికి. మొదట్లో వాళ్ళని మోడల్సుగా నిలబెట్టిచిత్రించటానికి ప్రయత్నించాడు. కాని కుక్క-ఈశ్వరరావు ఆకారం అతడిలో మూడ్‌ని చెడగొట్టేది. అందుకని తోటలో వాళ్ళిద్దరినీ మంచి యాంగిల్లో ఒక ఫోటో తీసుకుని తర్వాత దానికి పెద్దసైజులో నకలు తయారు

చేసాడు రంగుల్లో. నిజానికి ఆ దంపతు లిద్దరిదీ సరయిన జోడీ కాదు. కుక్కుటేశ్వరరావేమో ఓ పెద్ద దున్నపోతులా బలిసిన మెడ, ఇంతింత ముక్కుపుటా లతో దారుణంగా ఉంటే, ఆమె మాత్రం ముట్టుకుంటే కందిపోయే పూవులా సున్నితంగా కనిపిస్తుంది. తనలోని ఆర్టిస్టుని చంపుకుని ఆ బొమ్మ గీసాడు జగన్మోహన రావు. కావాలనే కుక్కుటేశ్వర రావును కాస్త అందగాడిగా చూయించాడు ఒరిజినాలిటీ చెడ కుండానే. మొత్తానికి దంపతులిద్దరి మొహాల్లోనూ సంతృప్తి కనిపిం చింది ఆ బొమ్మ చూసుకున్నాక. ఆ రెండు నెలల్లోను అతను వాళ్ళ ద్దరికీ బాగా సన్నిహితుడయాడు ఓ ఫామిలీ ఫ్రెండులా.

జగన్మోహనరావుకు వాస్త వంలో ఉన్న వస్తువును యాజి టీజ్‌గా చిత్రించి చూపరుల కళ్ళను వంచించటం కంటే మనసుని వం చించే ఆధునిక క్యూబిజాన్ని ప్రద ర్శించటమంటే ఎక్కువ ఇష్టం. వెలుగు నీడల్తో వింతవింత విన్యా సాల్ని ప్రదర్శిస్తాడతను. తన చిత్రాల్లో ఉత్సాహోద్రేకాల్లో అతను ఒకోచోట ఎంత బలమైన రంగుల్ని ఉపయోగిస్తాడో, మరికొన్నిచోట్ల నిరాశనీ, నిర్లిప్తతల్నీ చూయించ దల్చుకున్నప్పుడు అంత పేలవ మైన రంగుల్ని ప్రయోగిస్తాడు. అతను కొన్ని సమయాల్లో డబ్బు కోసము, మరికొన్ని సమయాల్లో తనలోని భావోద్రిక్తతల్ని చల్లార్చు కోనూ కుంచెను చేతబడ్తాడు. డబ్బుకోసం అతను ఇతరులకు గీచిపెట్టినవి అందంగా ఉంటాయి. తనకోసం చిత్రించుకున్నవి మట్టుకు ఒక పట్టాన మనుష్యులకు అర్థం కావు. అట్లా అతను గీచిన చిత్రాలు చాలా ఉన్నాయి. ఒక మిత్రుడి ప్రోద్బలంతోను, కొందరు పెద్దల ప్రోత్సాహంతోనూ అతను వాటినన్నిటినీ ఒకసారి టౌన్ హాల్లో 'వన్‌మాన్ షో' క్రింద ప్రదర్శించాడు.

జగన్మోహనరావు అనుకున్నట్లే ఆ చిత్రాలు ఎవరికీ అర్థం కాలేదు. కొందరు ఆధునికులమనుకునే వాళ్ళు, అలా జనం చేత అనుకో బడాలనుకునే 'కాక్స్‌కూంబ్' గాళ్ళూ మాత్రం అర్థమయిన వాళ్ళలా తలలూపారు, ఏమేమో కామెంట్స్ చేసారు. అన్నీ విని జగన్మోహనరావు తనలో తను నవ్వుకున్నాడు వాళ్ళ స్టుపిడిటీకీ, డాంబికత్వానికీ. అతనికి మనుషుల మీద పెద్ద సదభిప్రాయం లేదు.

లోపల్లోపల వాళ్ళను ద్వేషిస్తాడు; అసహ్యించుకుంటాడు. వాళ్ళ బలహీనతలు బయటపడుతున్నప్పు డల్లా హేళనగా నవ్వుకుంటాడు.

అసలు జగన్మోహనరావు ఈ చిత్రకళా ప్రదర్శనాన్ని ఏర్పాటు చేయటంలో ఉద్దేశ్యం ఎవరో కొన్ కిస్కాగాళ్లు వాటిని చూసి మెచ్చుకోవాలని కాక ఓ ప్రత్యేక మైన వ్యక్తి-స్త్రీ-వాటిని చూడాలనీ, అందులో ఈమధ్య తను వేసిన ఓ ప్రత్యేక చిత్రాన్ని ఆమె అర్థం చేసుకోవాలనీ. అత ననుకున్నట్టే ఆమె తన భర్తతో టౌన్‌హాలుకు విచ్చేసింది. ఆమె-వైశాలి!

అతను దగ్గరుండి వాళ్ళిద్దరికీ ఒక్కొ చిత్రం గురించీ అందులోని వర్ణాలు, వొంపులు, నీడల గురించీ విడమర్చి చెబుతుంటే వైశాలి ఎంతో కుతూహలంగా వినసాగింది. కాని ఆ ఫలానా చిత్రం దగ్గరపడు తున్న కొద్దీ జగన్మోహనరావు గుండెలు వేగంగా కొట్టుకో సాగాయి. సడన్‌గా అతను ఆగి పోయి అన్నాడు.

"మీరు చూస్తూ ఉండండి. మిగతావాళ్ళకు కూడ కాస్త ఎక్స్ ప్లెయిన్ చేయాలి. ఇప్పుడే వస్తాను."

అదృష్టవశాత్తూ ఆ సమయాన కొందరు కాలేజీ విద్యార్థినులు రావటంతో అతనక్కడికి వెళ్ళాడు. వాళ్ళకి వివరిస్తున్నాడన్నమాటే గాని అతని దృష్టి, ధ్యాస అంతా వైశాలి వద్ద- ఆమె చూస్తున్న చిత్రంవేపే ఉన్నాయి.

ఆ చిత్రం పేరు 'దున్న పెరిం చిన పుష్పం' అందులో వర్ణాలు ఒక దానిలోంచి మరో దానిలోకి చప్పుచప్పున జారిపోతుంటాయి. కొన్నిచోట్ల కొట్టొచ్చినట్లు కని పిస్తూ, మరికొన్నిచోట్ల పేలవం గానూ - చాలా కష్టపడి వేసాడు అతనా చిత్రాన్ని. క్రింది భాగంలో దున్నపోతు మొహం కనిపిస్తుం టుంది. మూతి, ముక్కుపుటాలు పూర్తిగా దున్నపోతువి, బలంగా ఉంటాయి. చెంపలు, కళ్ళు, నుదురు మాత్రం మానవత్వాన్ని ప్రతిబిం బిస్తుంటాయి. పైన వెంట్రుకలు మధ్యభాగానికి దువ్వబడి, మనుష్యు లకులా-తలమీద పొడుగాటి రెండు కొమ్ములుంటాయి, రెండు కొమ్ముల మధ్య భాగంలో, తల మీద, మరో విచిత్రమైన మొహం కనిపిస్తుంటుంది. ఆ మొహం నిండా స్త్రీత్వం రెండు భాగాలుగా చిత్రించబడింది. చుబుకము, పెద వులు ఎడమవేపుకు తిరిగి ఉంటే ఆ భాగానికి అమరకుండా కొంచెం

ఇవతలగా కుడివేపుకు చూస్తూ కళ్ళు, నుదురు ఉంటాయి. అందులో కనిపించే మరో విచిత్ర మేమిటంటే ఎడమవేపుకు తిరిగి ఉన్న అందమైన పెదాలు నవ్వుతున్నట్లుంటే, కుడివేపుకు చూస్తున్న అంతకంటె అందమైన కళ్ళు మెలాంకొలీని సూచిస్తుంటాయి. ఆ మొహానికి రెండు వేపులా రెండు లేత రెమ్మలు పైకి ప్రొజెక్ట్ అయి ఉన్నాయి.

ఆ చిత్రాన్ని చూస్తున్న వైశాలి ఒకటి రెండుసార్లు తనవేపుకు తల తిప్పటాన్ని గమనించాడు జగన్మోహనరావు.

అర్థమయ్యిందా ఆమెకు? తృప్తిగా నవ్వుకున్నాడు.

ఆ రాత్రి జగన్మోహనరావుకో కల వచ్చింది. అతనేదో కొండ పైకి ఎక్కుతున్నాడు. ఆ కొండ మీద ఒక దున్నపోతు గడ్డి మేస్తోంది. అది మేస్తోన్న ప్రదేశంలో ఒక గులాబీపువ్వు ఉంది. అతనికి భయమేసింది దున్నపోతు ఆ గులాబీని కూడా మేసేస్తుందేమోనని. దగ్గరకు వెళ్లి ఆ గులాబీని చేతిలోకి తీసుకోవాలనుకున్నాడు. దున్నపోతు దాన్ని మేయకుండా కాపాడాలనుకున్నాడు. దగ్గరకు వెళ్ళాడు. దున్నపోతు అతణ్ణి గమనించనట్లే తన పనిలో తానుంది వొంగి గులాబీ వేపు చేయి చాచాడు....

ఆ చిత్రంలో భావాన్ని వైశాలి అర్థం చేసుకున్నదనే జగన్మోహనరావు కొన్నాళ్ళపాటు అనుకుంటూ వచ్చాడు. కాని తర్వాత తర్వాత అతనికి తన అంచనా తప్పేమోనని కూడా అనిపించుతూవచ్చింది. ఎందుకంటే ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో అతనికి పెద్దగా మార్పేమీ కనిపించలేదు. మామూలుగానే నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడుతోంది. అప్పటికీ అతనోసారి కదిలించాడు.

"ఆ చిత్రం మీద మీ అభిప్రాయమేమిటి?"

"ఏ చిత్రం?"

"అదే దున్న ధరించిన పుష్పం"

పెద్దగా నవ్వేసిందామె.

"మీరేమో పెద్ద పికాసో శిష్యులు" ఆమె అన్నది. "నేనేమో అతి సామాన్యురాల్ని. మీబోటి ఆధునిక చిత్రకారుల భావాలు మాబోటి వాళ్ళం అర్థం చేసుకోగలమంటారా?"

ఆమె వ్యంగ్యంగా అన్నదేమోననిపించిందతనికి. ఆమెకా భావం అర్థమయిందేమో! మళ్లీ సందేహం ప్రవేశించిందతనిలో.

ఆ తర్వాత కావాలనే అతను నెల్లాళ్ళపాటు వాళ్ళ ఇంటి వేపు వెళ్ళలేదు. ఓ రోజు వైశాలి అతనికి ఓ చిన్న ఉత్తరం ముక్క పంపింది నౌకరు ద్వారా. అందులో ఇలా వుంది-

"ఇవాళ మీకు భోజనం మా ఇంట్లోనే. రాగలరు.

ఇట్లు,

శ్రీమతి కుక్కుటేశ్వరరావు."

క్రింద పి. యస్. క్రింద — "ఈ మధ్య మీరు ఊళ్ళో లేరని భావిస్తున్నాము," అని ఉంది.

అందులో ఉన్న క్లుప్తతకీ, అధికార ధోరణికి జగన్మోహనరావుకు కోపమొచ్చింది, వెళ్ళకూడదనుకున్నాడు. కాని ఆ రాత్రి వెళ్ళకుండా ఉండలేకపోయాడు.


"మామీద శీతకన్ను వేసినట్లున్నారు?" అందామె మృదువుగా.

నవ్వి ఊరుకున్నాడు జగన్మోహనరావు.

"ఈ మధ్య మా వైశాలి ఓ బొమ్మ వేసింది," కుక్కుటేశ్వరరావు అన్నాడు. "దాన్ని మీకు చూపించాలని ఎంత తహతహలాడుతున్న దనుకున్నారు? అది మీకు తప్ప మరెవ్వాళ్ళకీ అర్థం కాదట!" గలగలా నవ్వాడతను.

ఉలికిపడ్డాడు జగన్మోహనరావు ఆ ఆఖరు వాక్యానికి. వైశాలివేపు చూసాడు. కొంటెగా నవ్వుతోందామె,

తను వేసిన చిత్రాన్ని తీసుకొచ్చి చూపించింది వైశాలి. ఏమీ లేదందులో. రెండు బింబాలు



న్నాయి. ఒకటి పెద్దది, ఒకటి చిన్నదీ. ఒకదానిలో ఒకటి పెద్దది సూర్యుణ్ణి సూచిస్తోంది. బంగారపు రంగులో చుట్టూ అర్కులతో-కిరణాలమల్లే. మధ్యలోని చిన్నబింబం తెల్లగా, స్వచ్ఛంగా కనిపిస్తోంది. చుట్టూమట్టుకు వెలిగిపోతున్నట్లూ, పెద్ద బింబాన్నుంచి లోపలికి కాంతి ప్రవహిస్తున్నట్లూ చూపించబడింది. చిన్న బింబం పెద్దదానికంటే ఆకర్షణీయంగా ఉంది.

అందులోని భావం జగన్మోహనరావుకు వెంటనే అర్థమయింది. పెద్ద బింబం సూర్యుడు. చిన్న బింబం చందమామ. చందమామలో స్వయంప్రకాశత్వం లేదు. కాని వెలిగిపోతోంది సూర్యుని మూలంగా....తలెత్తి ఆమె భర్త వైపు చూసాడు జగన్మోహనరావు. అతను అవులిస్తున్నాడు పెద్దగా.

"తోటలోకి వెళ్దాం పదండి," అన్నది వైశాలి చిత్రాన్ని అతని చేతిలోంచి లాక్కుని టేబులు మీద ఉంచుతూ.

"మీరు వెళ్లి రండి, నాకు నిద్ర వస్తోంది," అన్నాడు కుక్కుటేశ్వరరావు.

"అయితే మనంవెళ్దాం పదండి" అంటూ వైశాలి ముందుకు దారి తీసింది. కొద్ది దూరం వెళ్ళాక ఆమె ఆగి వెనక్కు తిరిగి భర్త వేపు చూసింది. అతను చేయి ఊపాడు. నవ్విందామె. జగన్మోహనరావు ఇదంతా చూస్తూనే ఉన్నాడు. కాని అతని మనసు అతనిలో లేదు.

రాత్రి పది దాటుతోంది అప్పటికి. ఊరికి చివర ఉంది ఆ భవనం. గేటు తెరుచుకుని కుడివైపుకు కాస్త దూరం నడిస్తే మామిడితోట. అదీ కుక్కుటేశ్వరరావు వాళ్ళదే. వెన్నెల విరగకాస్తోంది తెల్లగా. చెట్ల చుట్టూ నీడలు పొట్టిగా, గుండ్రంగా పరుచుకుని ఉన్నాయి. ఆమె ముందు నడుస్తోంది. యాంత్రికంగా జగన్మోహనరావు వెనక నడవసాగాడు. అతని మనస్సులో ఎందుకో కసిగా ఉంది. వెన్నెలమీదా, నీడలమీదా, చెట్లమీదా, కుక్కుటేశ్వరరావుమీదా, వైశాలిమీదా, లోకం మొత్తం మీదా ఆఖరికి తన మీద కూడా. ఆ కసిని ఎలాగోలాగు బయట పడేసుకోవాలి.

"మీ అయన్ని ఊరంతా అసహ్యించుకుంటోంది. తెలుసా వైశాలీ?" అన్నాడు ద్వేషంగా.

అదోలా చూసిందామె అతని వైపు.

"దాన్ని అసహ్యం అనరు,

ఈర్ష్య అంటారు!" అన్నది నిర్ల క్ష్యంగా.

"సంతృప్తి పడటానికి అలా అనుకోవటమే మార్గం" అతని కెందుకో ఆమెను బాగా కించపరచా లనిపించింది. "మన ఊళ్లో తులసి అని లేదూ, దగ్గర దగ్గర నలభై యేళ్ళకు మించి ఉంటాయి దానికి. దానితో మీ ఆయనకు సంబంధ ముంది" అన్నాడు.

ఇద్దరూ వెన్నెట్లో ఉన్నారు. ఆమె మొహం స్పష్టంగా కని పిస్తోందతనికి. ఒక్క క్షణం వైశాలి పెదాలు కంపించాయి. చప్పున నేల మీదకు కూలిపోయిం దామె. మోకాళ్ళలో తల దూర్చి ఏడవసాగింది.

ఆమెను ఓదార్చడానికి జగన్మో హనరావు ఏ ప్రయత్నమూ చేయ లేదు. అలా నిలబడి చూస్తుండి పోయాడు.

కొద్దిసేపయాక ఆమె తల పైకె త్తింది. ఆమె చెంపమీద నిలచిన కన్నీటి బొట్టులో చంద్ర కిరణం కదిలి తళుక్కుమంది.

జగన్మోహనరావుకు జాలేసింది. ఆమె మొహాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని ముద్దాడాలనిపించింది.

"క్షమించండి," అన్నాడు.

"అదంతా ఎందుకు గాని, ఒక సంగతి చెప్పండి" వైశాలి అన్నది.

"భర్తతో సుఖంగా కాపురం చేయటం నేరమే నంటారా?"

"ఛ ఛ, నా ఉద్దేశ్యం అదికాదు నేను.... నేను...."

"మీ ఉద్దేశ్యమేదో అప్పుడే తెలిసిందిలెండి నాకు." మధ్యలో అడ్డుకుందామెఅతణ్ణి."మీ చిత్రాన్ని చూసిన నాడే....నా కర్థంకాని దేమి టంటే...భర్త అందగాడు కానంత మాత్రాన, అతడి చరిత్ర హీనమైన దయినంత మాత్రాన! అతనితో సంసారం చేయకూడదా?"

జగన్మోహనరావేమీ సమా ధానం చెప్పలేదు. ఆమె మోకాలి మీద నిల్చిన చేతిమీద తనచేయి వేసి మెల్లగా నిమిరాడు.

"మీరు మంచివాళ్ళే.కాదనను" మళ్ళీ అన్నదామె. "కాని అందరి లాగే మీలోనూ స్వార్థముంది. అది ఎట్లాంటి స్వార్థమంటే నిశ్చలంగా ఉన్న సరోవరంలోకి రాయి విసిరి కల్లోలం రేపటానికిగాని, సుఖంగా సాగుతున్న ఒకళ్ళ సంసారంలో చిచ్చు పెట్టటానికి గాని వెనుకాడ నట్లాంటిది...."

"వై....వైశాలిగారూ,"తత్తర పడ్డాడు జగన్మోహనరావు. "మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు"

"అపార్థం కాదు, నన్ను

సొంతం చెప్పనివ్వండి .... మాది మరీ లేని కుటుంబమేమీ కాదు. అట్లా అని ఉన్నదీ కాదు, పొట్టగడుస్తుంది గాని, మాకు లగ్జరీస్ మాత్రం కలల్లోనే నడుస్తుంటాయి. నాతోటి పిల్ల మాధురి పట్టు పరికిణీల్లోను, రంగు రంగుల సిల్కు గౌన్లలోను నాతో ఆడుకుంటుంటే నాకెంతో ఈర్ష్య కలిగేది. కనీసం పండగలలో, పేరంటాల్లోనైనా అట్లాంటివి ధరించలేనుకదా అని విచారం కలిగేది. వాళ్ళది పెద్దమిద్దె. ఆ గదుల్లో నడయాడుతున్నప్పు డెల్లా నా మనస్సులో ఏదో థ్రిల్ లాంటిది కలిగేది. అవ్యక్తమైన దిగులూ ఆవరించేది. అందమైనవి, విలువైనవీ అయిన ఆ ఇంట్లోని ఏ వస్తువును ముట్టుకున్నా నావొళ్లు పులకరించేది మా పూరింట్లో కూర్చుని అవన్నీ తల్చుకుని తల్చుకుని ఊహా లోకాల్లో విహరించేదాన్ని జీవితంలో నాకట్లాంటివి ఎటూ దక్కవుకదా అని కుమిలిపోయేదాన్ని కొన్ని సమయాల్లో- సరే....ఎట్లాగో ఈ కుక్క ఈశ్వరరావుగారి సంబంధం వచ్చింది. ముందే తెలిసింది ఈయన నడవడిక గురించి. అదంతా అయినా వొప్పుకున్నాను సంతోషంతో. నా కలలు పండించుకోవచ్చుగదా అనిపించింది....అనుకున్నట్టే జరిగింది కూడా. ఆయన్ని చాలావరకు మార్చగలిగాను. కాని - మీరు....మీరు ఎందుకు నామీద మీకీ కసి??"

"కసికాదు వైశాలీ. నీ మీద.... నీమీద...." జగన్మోహనరావు గొంతులోంచి మాటలు బయటికి రాలేకపోయాయి. తన రెండు చేతుల్నీ ఆమె బుజాలమీద వేశాడు. అదేమీ గమనించనట్టే ఆమె మళ్ళీ చెప్ప నారంభించింది.

"నా చుట్టూఉన్న పరిసరాల్ని. నా జీవితాన్ని అందంగాఅద్భుతంగా మలుచుకోవాలను కున్నాను. మలుచుకోగలిగాను. కాని ఎంత కష్టపడ్డానని అందుకోసం... అవును నిజమే....అంతా బాగుంది, కాని ఈయనే ఓ పెద్ద లోపం. ఈయన రూపం....ఈయన గత చరిత్ర .... అయినా........ అయినా........ ఎన్ని పుణ్యాలు చేసుకుంటే మాత్రం మనుషులకి అన్నీ దొరకటం సాధ్యమా!? ఎంతమంది ఆడవాళ్ళు అందమైన, సచ్ఛీలురైన భర్తలు లభించీ మనసుల్లో అసంతృప్తులై కుళ్ళిపోవటంలేదు....!? ఈయనకు నామీద ఎంత నమ్మకమని! ఆ మాత్రం నమ్మకం ఎంతమంది భర్తలకు తమ భార్యలమీద ఉంటుంది కనక!?! ఎంత చిత్ర

మైనది ఈ మనస్సు....వొద్దు వొద్దు మీ చెయ్యిని అక్కడనుంచి తీసె య్యండి ముందు....లోకమొక టుంది మధ్య. దాన్నిమనం లెక్క చెయ్యక తప్పదు!! అందుకే ఈ లోకమంటే ఎంత అసహ్యమని వాకు!? మేడిపళ్ళలాంటి ఈ మను ష్యుల్ని నిర్లక్ష్యంచటానికీ, వాళ్ళ మొహంమీదే ఉమ్మేయటానికి ఎవరికైనా ఒక్కటే మార్గం— డబ్బు!! అది నాభర్త దగ్గర ఉంది. ఆయన చాటునుండి దిక్కరించు తాను ఈ లోకాన్ని...."

జగన్మోహనరావు మెదడు మొద్దుబార సాగింది. అతని కళ్ళ ఎదుట వైశాలితప్ప మరేమీ కని పించటంలేదు. గబాల్న ఆమెను దగ్గరకు లాక్కుని ఆమె మెడమీద ముద్దు పెట్టుకున్నాడు.

"వద్దువద్దు" అతణ్ణించి గింజు కుంటూ అన్నదామె. "నాలో ఇంకా మిగిలివున్న సంతృప్తిని. అహంభావత్వాన్ని నానుంచి దూరం చెయ్యకండి. మనిషికి ముఖ్యమై నది, పవిత్రమైనదీ, ఈ దేశంలో విలువగా నిలబెట్ట గలిగేది. అది-దాన్ని కోల్పోవటం నా కిష్టం లేదు."

జగన్మోహనరావుకు పిచ్చెత్తి నట్లయింది. అతని కళ్ళ ముందు పిశాచాలు నాట్య మాడసాగాయి. అతని స్థితిని అర్థం చేసుకున్న వైశాలి ఒక్క తోపు తోసిందతణ్ణి.

"మీరంటే నాకిష్టమే. కాని... కాని....మీరంటే నా కసహ్యం!!"

ఒక్కపరుగు తీసిందామె తన ఇంటివేపు.

నిర్లిప్తంగా చూస్తూ నిల్చుండి పోయాడు జగన్మోహనరావు. అతని మనస్సునిండా ఏదో వెల్తి ఏర్పడ్డట్లయింది. పిచ్చెత్తిన వాడిలా పొలాల్లోపడి తెగతిరిగాడు ఆరాత్రి. అలసటతో ఓ తెల్లవారు ఝామున ఇంటికి జేరుకున్నాడు.

అతని కాళ్ళనిండా నిస్సత్తువ ఆవరించింది. కళ్ళమీదకు నిద్రవచ్చే సూచనలు కనిపించలేదు. తటాలున అతని మెదడులో ఓ భావం మెరి సింది. కళ్ళెదుట ఆ చిత్రం కదు ల్చాడింది. లైటువెలిగించి దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

"దున్న ధరించిన పుష్పం!"

పేరు చూసి చిన్నగా నవ్వు కున్నాడు. ఆ నవ్వులో వ్యంగ్యం ఉంది. ఐరనీ ఉంది. నిర్లక్ష్యం ఉంది. కుంచె తీసుకుని అంతకు ముందు నీలం రంగులోఉన్న ఆ పేరు చెరిపేసి, రక్తవర్ణం కలిపి మరోపేరు రాసాడు.ఎర్రగా మెరిసి పోతున్న ఆ పేరు - 'వివాహం!' *